కథ

# అపరిచితుడు

– వలివేటి నాగచంద్రావతి

"లోపలికి రావచ్చా సార్?"

టేబుల్‌ముందు కూర్చుని ఆఫీసు పని చేసుకుంటున్న నాన్నా, లెక్కలతో కుస్తీ పడుతున్న నేనూ, సోఫాలో నా పక్కనే కూర్చుని పేపరు చూస్తున్న బామ్మా ఒక్కసారి తలెత్తి చూశాం.

గుమ్మంలో నుంచుని ఉన్నాడతను.

"రండి" అన్నారు నాన్న.

లోపలికొచ్చి, నమస్కారం చేస్తూ నుంచున్నప్పుడు చూశాను- ఇరవై అయిదూ ముప్ఫయి వయసుండొచ్చు. తెల్లటి ప్యాంటూ, సన్నని నీలం గళ్ల షర్టూ, సాదాసీదాగా ఉన్నాడు. మొహం చూడగానే మంచివాడు, చాలా నెమ్మదస్తుడు అనిపించాడెందుకో.

నాన్న ప్రశ్నార్థకానికి ఆన్సరుగా, "నా పేరు రామరాజండీ. మీ మేడమీద గది ఖాళీగా ఉందని చెప్పారు. అది రెంట్‌కి నాకివ్వగలరేమోననీ..." అన్నాడతను.

"అబ్బే అది ఖాళీగా లేదండీ. ఈ ఇంటికి ఉడ్‌వర్క్ చేయించేటప్పుడు మిగిలిన చెక్కా ముక్కా దాన్నిండా పడున్నాయ్" అన్నారు నాన్న.

"నా లగేజీ ఎక్కువ లేదండీ. ఓ చిన్న మంచం, రెండు కుర్చీలూ అంతే. అవన్నీ పక్కకి జరిపితే సరిపోతుంది" ఎలాగయినా ఒప్పించాలనుకున్నట్టుగా అన్నాడతను.

"మా సామానే సగం గది ఆక్రమించేస్తూ ఉంటే మిగతా కాస్త జాగా అద్దెకివ్వటం..." నాన్న పస్తాయించారు.

"నాకే అభ్యంతరం లేదంటున్నాను కదండీ. ప్లీజ్ కాదనకండి. ఈ కాలనీలో అయితే నా పనికి దగ్గరగా ఉంటుంది. మీరడిగినంత రెంటూ పే చేస్తాను ప్లీజ్" ప్రాధేయపడ్డాడతను.

"కానీ..." నాన్న ఇంకా నసుగుతుంటే, అమ్మ 'ఇలారండీ' అని లోపలికి పిలిచింది.


'అతనే సర్దుకుంటానంటున్నాడుగా- సరిపోకపోతే తనే ఖాళీ చేసేస్తాడు. మనకేం, అద్దెమాత్రం రెండు వేలకు తగ్గదని చెప్పండి' అమ్మ గుసగుస బాగానే వినిపించింది. అవకాశం వినియోగించుకోవడమంటే ఇదే మరి.

ఈ లోపల మా బామ్మ అతని పుట్టు పూర్వోత్తరాలన్నీ ఆరా తీసింది. వాళ్ల అసలు ఊరేదీ... ఇక్కడ పనేమిటీ... అక్క చెల్లెళ్లూ అన్నదమ్ములూ ఎంతమందీ... వాళ్లెక్కడుంటారూ... వగైరా వగైరా...

వాళ్లది కర్నూలు దగ్గర చిన్న పల్లెటూరట. ఇక్కడి శనివారప్పేట చివర్న వాళ్లకి కోళ్ల ఫారాలు ఉన్నాయట. అవి చూసుకోవడానికి తనిక్కడుంటున్నాడట. ఆ శనివారప్పేటలో సదుపాయాలు సరిగ్గాలేక ఇక్కడ గది చూసుకుంటున్నాడట.

నాన్న ఇవతలికి వచ్చి, సరేనని చెప్పగానే రిజల్ట్స్ రోజున పేపర్లో తన నంబరు కనిపించినంత రిలీఫ్ కనిపించిందతని మొహంలో.

అడ్వాన్స్ అడిగే వ్యవధి ఇవ్వకుండానే పదివేల రూపాయలు లెక్కపెట్టి నాన్న చేతిలో పెట్టాడు... "మూడు నెలల అడ్వాన్స్, కరెంటుతో కలిపి... సరిపోతుందనుకుంటాను" అంటూ. ఉక్కిరి బిక్కిరవటం మావంతయింది.



మర్నాడే సామాను తీసుకు వచ్చేస్తానని చెప్పి వెళ్లిపోయాడతను. నాన్నా నేనూ కలిసి మేడమీద గదిలో చెక్కముక్కలన్నీ ఓ మూలకి తోసి ఓ పాత దుప్పటి కప్పేశాం. మా పనిమనిషి రాములమ్మతో గది కడిగించి ముగ్గు పెట్టించేసిందమ్మ.

అన్నట్టుగానే ఓ పెద్ద సూట్‌కేస్‌తో మా మేడమీద గది ప్రవేశం చేశాడతను.

ఆ మర్నాడు ఓ ఐరన్‌కాట్, పరుపూ, రెండు కేన్ కుర్చీలూ, ఓ పెద్ద బిస్లరీ బాటిల్ పెద్దపెద్ద అట్ట పెట్టెలు రెండూ ఆటోడ్రైవరుతో పైకి మోయించుకు వెళుతుండగా చూశాం అంతే. మళ్లీ అతన్ని చూళ్లేదు మేము.

మా బామ్మ ఉండే- రాత్రినిద్రా సమయం, ఉదయం ఓ గంట పూజా సమయం తప్పించి ముందు హాల్లోని పెద్ద సోఫాయే ఆవిడ నివాసం. అలాంటి మా బామ్మకూడా, "ఆ మేడ మీద కుర్రాడు ఎప్పుడు వస్తున్నాడో, ఎప్పుడు వెళుతున్నాడో తెలియడమే లేదు సుమీ" అంది నాన్నతో.

ఆవిడలా అన్న గంటకల్లా మా గుమ్మం ముందున్నాడతను. చేతిలో సంచీ, దాన్నిండా ఆకుకూరలూ, కాయగూరలూ గట్రా బయటికే కనిపిస్తున్నాయి.

"నమస్కారం బామ్మగారూ" అని బామ్మని పలకరించి కూరల సంచి గుమ్మంలోపల పెట్టాడు. అయోమయంగా చూస్తున్న బామ్మతో, "నేను వెళ్లే త్రోవలో అన్నీ పొలాలే కదండీ. ఇప్పుడిప్పుడే కూరలు కోస్తున్నారు. ఫ్రెష్‌గా కనిపిస్తేనూ తీసుకొచ్చాను, తీసుకోండి" అన్నాడు నమ్రతగా.

"ఇన్ని కూరలా?" నవనవలాడుతోన్న కూరగాయల్ని సంభ్రమంగా చూస్తూ, "ఎంతకు కొన్నావో ఏమిటో- అడిగి తీసుకో నాయనా" అంది మళ్లీ.

"అభిమానానికి వెల ఉండదు బామ్మగారూ" చిరునవ్వుతో అని వెళ్లిపోతూ నన్నుచూసి ఆగి, "నీకు ఖాళీ ఉన్నప్పుడు పైకి రా చిన్నా. కొత్త వీడియోగేమ్స్ కొన్నాను చూద్దువుగానీ" అని వెళ్లిపోయాడు.

ఆ తరువాత స్కూలుకి వెళ్లానేగానీ వీడియో గేమ్స్ పేరు విన్నాక లెసన్స్ చెవికెక్కుతాయా? స్కూలు వదలటం ఆలస్యం, రోజూలా గ్రౌండ్‌కి వెళ్లకుండా ఇంటికి పరిగెత్తాను.

నాకోసమే ఎదురుచూస్తున్నట్టు పిట్టగోడ దగ్గరే నుంచున్నాడతను. నన్ను చూడగానే రమ్మన్నట్టు చెయ్యూపుతూ, "రా చిన్నా" అని పిలిచాడు.

"నా పేరు భాస్కర్. ఇంట్లో అందరూ 'బాచీ' అంటారు. అందరిలా కాకుండా నన్ను అతను చిన్నా అని పిలవడం నాకెంతో బావుందనిపించింది.

షూ ఓ పక్కకీ, బ్యాగ్ ఓ పక్కకీ విసిరేసి,

కథ

అమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా పైకి పరిగెత్తాను.

గదిలోకి వెళ్లగానే 'నిజంగా ఇది మా గదేనా' అనిపించింది. చెక్కముక్కల మీద మేము కప్పిన పాత దుప్పటి కనబడకుండా గోడ పొడవునా సిల్కు కర్టెనూ, గోడలకి అక్కడక్కడా ప్రకృతి దృశ్యాలున్న ఫొటోలూ, మంచంమీద కాస్ట్లీ దుప్పటీ, దాని ఎదురుగా గోడకి పెద్ద ఎల్.ఈ.డీ టీవీ... అబ్బ గది రూపురేఖలే మార్చేశాడతను.

కళ్లు విప్పార్చి చూస్తున్న నాతో, "బావుందా?" అన్నాడతను చిరునవ్వుతో నా భుజం మీద చెయ్యేసి.

ఎంతసేపు వీడియో గేమ్స్ ఆడుతూ గడిపేశానో తెలీదు- మా చెల్లి బిందు గది ముందుకొచ్చి "అన్నా ఇక కిందికొస్తావా? అమ్మ నిన్ను రమ్మని అరుస్తోంది ఇందాకట్నుంచీ, వినపడటం లేదా" అంటుంటే లేచాను.

★ ★ ★

నెల గడిచేటప్పటికి ఇంట్లో వారందరికీ అతనంటే సదభిప్రాయం ఏర్పడిపోయింది. ఎందుకేర్పడదూ- వారానికో పదిరోజులకో సంచినిండా అప్పుడే కోసినట్టుండే కూరగాయలు తీసుకొచ్చి ఇస్తున్నాడు. మా బామ్మ పూజకి రకరకాల పూలు తెచ్చిపెడుతున్నాడు. ముఖ్యంగా వాటి ఖరీదు ఇవ్వబోయినా తీసుకోడాయె. అది ఇంకా బాగుంది కదా. అలా మా అమ్మకీ బామ్మకీ ఆప్తుడయిపోయాడతను. "నాయనా రామం" అంటుంది బామ్మ దగ్గరివాళ్లని పిలిచినట్టు.

వాళ్లమాట వదిలేస్తే- ఎందుకోగానీ నేనంటే అతనికి చాలా ఇష్టమేర్పడి పోయింది. ఎంతలా అంటే, పై రూము డూప్లికేటు 'కీస్' నాకిచ్చేసి, "నేనున్నా లేకపోయినా నీకు కుదిరినప్పుడు పైకొచ్చి వీడియోలు చూసుకో" అనేటంత. "అంకుల్ అనొద్దు రాజు భయ్యా అని పిలు" అని ఆప్యాయత చూపించేటంత.

నాకు కూడా రాజు భయ్యాతో గడపటం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. ఏం చదువుకున్నాడో తెలీదుగానీ ఏ విషయం గురించయినా గానీ దానిమీద పూర్తి అవగాహన ఉన్నట్టు అర్థమయ్యేలా చెప్పేవాడు.

ఆ మాట పొరపాటున మా ఇంట్లో వాళ్లతో అన్నాను- అంతే. అతను వచ్చేవరకూ కాపేసి, నిలేసి, ఏ మాత్రమూ చదువుమీద ధ్యాస పెట్టని నన్ను తెగడి, నన్నాకట్టుకుంటున్న అతని నేర్పరితనాన్ని పొగిడి, నన్ను చదివించే బరువునీ, నన్ను టెన్త్ గట్టెక్కించే బాధ్యతనీ అతని భుజస్కంధాలపై మోపి ఒక నమస్కారం చేశారు.


ఎగిరి గంతెయ్యాలనిపించింది నాకు. ఈ పేరున ఇంకా ఎక్కువ సమయం అతనితో గడపొచ్చునని.

అతని దగ్గర చదువు శిక్షణలా ఉండేదికాదు. ప్రతి లెసనూ కొత్త వింతల్ని ఆవిష్కరిస్తున్నట్టుగా ఉండేది. ముందున్నది తెలుసుకోవాలనే ఉత్కంఠ కలిగిస్తూ ఉండేది.

ఆ నెల క్లాసు టెస్టుల్లో నాకు మంచి మార్కులు వచ్చేసరికి మావాళ్లకి అతనిమీద మంచి గురి కుదిరిపోయింది.

★ ★ ★

అతని దినచర్య రోజూ ఒకలా ఉండేదికాదు. ఒక్కోరోజు రాత్రి ఎప్పుడు బయటకు వెళ్లేవాడో తెలీదు, మర్నాడు మిట్ట మధ్యాహ్నం వచ్చేవాడట- బామ్మ చెప్పేది. ఒక్కోరోజు చీకట్లు విడీవిడనప్పుడు మెట్లెక్కుతూ మాకు దర్శన మిచ్చేవాడు. ఒక్కోసారి రోజుల తరబడీ గదిలోనే ఉండిపోయేవాడు. ఆ రోజుల్లో శని ఆదివారాలొచ్చి నాకు స్కూలు సెలవులయితే నాకు నిజంగా పండుగే. టీవీలో వీడియో గేమ్సే కాదు... ఏవో ఛానల్సులో గ్రహాల గురించీ, జంతువుల గురించీ, ప్రపంచంలో ఉన్న వింతలగురించీ చూస్తూ వాటి గురించి మాట్లాడుకునేవాళ్లం. సెకండ్ షో సినిమాలకీ



వెళ్లేవాళ్లం.

అంతా బాగానే ఉండేది గానీ ఉన్నట్టుండి అతను ప్రవర్తించే తీరు నాకు చాలా బాధ కలిగించేది.

ఒక రాజకీయ పార్టీవాళ్లు ఎందుకో బంద్ ప్రకటించడం వల్ల అనుకోకుండా స్కూలుకి సెలవు ఇచ్చేశారు. అర్ధాంతరంగా వచ్చి తన భక్తి ఛానల్ వీక్షణానికి అడ్డం రాకుండా, "రామంపైనే ఉన్నాడ్రా" అని హింటిచ్చింది బామ్మ నన్ను వెళ్లమన్నట్టుగా.

ఇంకేం కావాలి- ఉత్సాహంగా గెంతుతున్నట్టే మెట్లెక్కాను. తలుపు దగ్గరగా వేసుంది. తోశాను. అల్మారా దగ్గర నుంచుని ఏదో తీస్తున్నాడు రాజు భయ్యా. గుమ్మం దగ్గర నన్ను చూడగానే ముందు ఉలికిపాటు, వెంటనే తత్తరపాటు, ఆ క్షణానే నుదురు చిట్లింపు, మరుక్షణమే మండిపాటు... వన్ బై వన్ అలా... మొహంలో రంగులు మారిపోవడం అప్పుడే చూశాను నేను.

"తలుపు తట్టి రావాలని తెలీదూ స్టుపిడ్" రౌద్రరసానికి మారుపేరులా అతను కళ్లెర్రజేసి హూంకరిస్తూంటే బిక్క మొహం వేసి పరిగెత్తుకుంటూ కింది కొచ్చేశాను.

పావుగంట గడవలేదు- మెట్లకిందిదాకా వచ్చి "చిన్నా చిన్నా" అంటూ కేకమీద కేక. 'హ్హూఁ నాకు లేదా రోషం?' పలకలేదు నేను. "అతనట్లా పిలుస్తోంటే ఊఁ అనవేరా" అని అమ్మా బామ్మా హెచ్చరికలు.

"నేను చదువుకోవాలి" అన్నాను బింకంగా.

"అక్కడే చదువుకోవచ్చుగా వెళ్లు" అంది బామ్మ.

బయట నేను కనబడగానే పూర్తిగా కిందికొచ్చేసి బలవంతంగా దాదాపు నన్ను మోసుకెళుతున్నట్టే తీసుకువెళ్లాడు గదిలోకి రాజుభయ్యా. వెళ్లగానే కాళ్లా వేళ్లా పడిపోయాడు. ఆ రోజు తన మనసెందుకో డిస్ట్రబ్డ్‌గా ఉందట. ఆ చిరాకులో తెలియకుండానే నోరు జారాడట. "సారీ సారీ చిన్నా" అని చేతులు పట్టుకున్నాడు. పిజ్జా తెప్పించాడు, సినిమాకి లాక్కెళ్లాడు, ఇక కరిగిపోక చస్తానా- ఇది మొదటిది.

రెండోసారి- దసరా పండుగ ముందు "నాయనా రామం, పండక్కి ఊరెళ్లవూ?" అని అడిగింది బామ్మ రాజుభయ్యాని- మెట్లెక్కుతోంటే. "వెళ్లడం లేదండీ" అన్నాడు మర్యాదగా. ఇక ఊరుకోవచ్చునా- ఊహుఁ, ఊరుకుంటే ఆమె బామ్మెలా అవుతుందీ!

"అయ్యో అదేమిటినాయనా, పెద్ద పండుగయ్యే, వెళ్లకపోతే మీ అమ్మ బాధపడదూ? మీ పిల్లలకి తెలవదయ్యా మీకోసం మేమెంత అంగలారుస్తామో. నా మాటవిని వెళ్లు నాయనా. మా పినతల్లి కొడుకొకడు నీకులాగే..." అంటూ ఓ పావుగంట సుత్తేసింది.

అప్పటికి కామ్‌గా పైకి వెళ్లిపోయి ఆ తరువాత నేను కనబడగానే దులిపెయ్యడం ప్రారంభించాడు. "నేను వెళతాను- మానేస్తాను ఆవిడకెందుకు బాధ? నా వ్యక్తిగత విషయాల్లో కలగజేసుకోవటం నాకస్సలు నచ్చదు. పెద్దావిడని ఒదిలేశాను గానీ లేకపోతేనా..."

నిప్పులు కక్కుతోన్న ఆ మొహాన్ని చూడలేక కిందికొచ్చేశాను. మనసులో ఓ ఆశ ఇంకాసేపట్లో చల్లబడి తనే పిలుస్తాడని. పండగ సెలవుల్లో నాలుగు రోజులు అయిపోయాయి. ఉహుఁ, పిలవలేదు. చిన్నా అన్న పిలుపు వినబడక చాలా బెంగని పిస్తోంది నాకు.

ఆరోజు విజయదశమి. ఒక క్యారీ బ్యాగుతో గుమ్మంలోకి వచ్చాడు రాజుభయ్యా. మొదట్లో మాదిరే, "లోపలికి రావచ్చా బామ్మగారూ" అన్నాడు ఏమీ జరగనట్టే.

"అయ్యో, నీకు అభ్యంతరమా నాయనా రా రా" అంది బామ్మ మందహాసం చిందిస్తూ. చేతిలో ఉన్న రెండు ప్యాకెట్లూ, పువ్వులూ స్వీట్లూ ఉన్న క్యారీబ్యాగూ సోఫాలో పెట్టాడు రాజుభయ్యా. "మీరు చెప్పినట్టు అమ్మదగ్గరకు

వెళదామని ఎంతో ప్రయత్నించా బామ్మగారూ. మా వర్కర్లున్నారే నేను లేకపోతే కొంప మునిగిపోయేటంత పని మొదలు పెట్టారిప్పుడే. ఏం చేయను? మనసు ఎక్కడో ఉన్నా నేనిక్కడ ఉండక తప్పలేదు" అని, ప్యాకెట్లమీద చెయ్యి వేసి, "ఈ రెండు చీరలూ గద్వాల నుంచి తెప్పించాను- అమ్మకి తీసుకెళదామని. మీరూ అక్కగారూ నాకు మా అమ్మా అక్కగార్లతో సమానమే. ఈ రోజు మీరివి కట్టుకుంటే ఆ అమ్మవారే కట్టుకున్నట్టు సంతోషిస్తాను. దయచేసి కాదనకండి" అంటూ చేతులు జోడించాడు వినయంగా.

బామ్మ ఉబ్బితబ్బిబ్బవటం కనిపిస్తూనే ఉంది. "ఏవిటోనయ్యా రామం. కూరలంటావూ, పళ్లంటావూ ఇన్నిన్ని తెచ్చిపడేస్తావు. వద్దందామంటే, అలా అనొద్దని ముందే కాళ్లకి బంధం వేసేస్తావయ్యె" మొహమాటానికి అభిమానాన్ని కలిపి అంది బామ్మ.

"ఎందుకండీ ఇవన్నీ" అమ్మకూడా అయిష్టంగా అన్నట్టు ఏదో గొణిగింది కానీ ఆ వాలకంలో- అతను వెళితే ఆ ప్యాకెట్లలో చీరలెలా ఉన్నాయో చూడాలనే ఆత్రమే కనిపించింది నాకు.

వెళ్లిపోతూ, "చిన్నా పైకిరా" అన్నాడు రాజుభయ్యా.

నిన్నటిదాకా మొహం మాడ్చుకుని ఇప్పుడు పిలవంగానే ఎగురుకుంటూ వచ్చేస్తాననుకుంటున్నాడా... తల తిప్పేసుకున్నాను అలకగా. కానీ ఆ బింకం ఎంతోసేపు నిలవలేదు. భయ్యా పిట్టగోడ దగ్గరకొచ్చి మరోసారి "చిన్నా" అని పిలిచేసరికి తప్పదన్నట్టు మొహం పెట్టి వెళ్లాను.

మళ్లీ అంతా మామూలే. కితకితలు పెట్టి నవ్వించేసి, స్వీట్లో చాక్లెట్లో నోట్లో కుక్కేసి "నువ్వు నా చిన్నారి తమ్ముడివయ్యా" అని ప్రేమ కురిపించి...

నేను కిందికొచ్చేసరికి అమ్మా, బామ్మా చీరల మడతలు విప్పి చూస్తున్నారు. "ఇంత జరీ అదీ- మూడు నాలుగు వేలకు తక్కువ ఉండవు" అనుకుంటున్నారు.

"ఏమిటి తన స్వభావం? ఇతను చేసే చేష్టలు అసాధారణంగానో, అసహజంగానో అనిపించటంలేదూ?" అన్నారు నాన్న.

అమ్మా బామ్మా సంబరపడినంతగా ఆయన సంతోషపడుతున్నట్టు అనిపించలేదు నాకు. అవును, నాన్న అన్నమాట నిజం. అతను ఏది చేసినా కాస్త విపరీతంగానే అనిపిస్తుంది.

బామ్మకి ఒంట్లో బాగోలేనప్పుడు చూడ్డానికని వచ్చి, పెద్ద హార్లిక్స్ సీసా, రెండు కిలోల ద్రాక్షా, బత్తాయిలూ, ఆపిల్స్... ఒకటి కాదు ఊళ్లో దొరికే పళ్లన్నీ రెండు బుట్టలు నెత్తినపెట్టుకుని తెచ్చి ఇచ్చి వెళ్లాడు. మా బిందు పుట్టినరోజున పెద్దకేకూ, బోలెడు చాక్లెట్లూ తీసుకువచ్చాడు.

నేను చాలాసార్లు గమనించాను. నమ్మశక్యం కాక నేను తెల్లబోయి చూస్తూ నిలబడిపోయిన పనులు చాలా చేశాడు రాజుభయ్యా. మచ్చుకి కొన్ని-


గది ఊడ్చి తడిగుడ్డ పెట్టినందుకు మా రాములమ్మ వంద రూపాయలు అడిగితే వెయ్యి రూపాయలు ఇచ్చాడు. నేను చూశాను. "ఇంతా?" అని రాములమ్మే నోరు తెరిచేసింది. "అంతెందుకు భయ్యా" అంటే "పోనిద్దు పాపం, ముసలిది" అన్నాడు తేలిగ్గా. సెకండ్ షో సినిమా కెళతామా- ఆటోవాణ్ణి ఎంత అని అడగడు. దిగగానే జేబులోంచి చేతికి ఎంతొస్తే అంతా తీసి ఇచ్చెయ్యడం తప్ప లెక్క పెట్టగా చూళ్లేదు నేను.

వారం వారం యాయవారానికి వచ్చే శాస్త్రిగారు ఆశీర్వచనం చేసినందుకు గానూ వెయ్యి రూపాయలు దక్షిణ తీసుకెళ్లేవాడు. ఇలా నేను చూసిన వింతలెన్నో.

వీటన్నిటికీ మించిన షాక్ ఇచ్చాడు రాజుభయ్యా.

★ ★ ★

రాజుభయ్యా మాయమయిపోయాడు. నిజం, వారం దాటింది. పది



రోజులయిపోయింది. భయ్యా రాలేదు- పోలీసులొచ్చారు. భయ్యా ఫొటో చూపించి "ఇతనేనా మీ మేడమీద గదిలో ఉండేది" అని అడిగారు. అవునన్నాం.

పైకి వెళ్లారు. తాళం బద్దలు కొట్టారు. లోపల పూచిక పుల్లలేదు- చెక్క ముక్కలూ, దానిమీద కప్పిన పాత దుప్పటీ తప్ప. అదిరిపడ్డాం మేము.

అక్కణ్ణుంచీ ఎంక్వయిరీ. ఎన్నాళ్ల క్రితం వచ్చాడు? ఏ ఊరన్నాడు? ఏం పేరన్నాడు? ఎలా ఉండేవాడు? వగైరా వగైరా...

మా బామ్మ ప్రమాదం ఊహించిందనుకుంటా, ఆకుకి అందకుండా పోకకి పొందకుండా చాలా జాగ్రత్తగా సమాధానాలు చెప్పింది. "ఏమో నాయనా, ఆర్నెల్ల క్రితం మేడమీద గది కావాలని వచ్చాడు. మాకేం సంబంధం లేకుండా విడిగా ఉంది కదా అని ఇచ్చాం. చేపల చెరువులున్నాయని మాత్రం చెప్పాడు. ఏ ఊరో చెప్పాడుగానీ గుర్తులేదు. ఎప్పుడొచ్చేవాడో ఎప్పుడెళ్లేవాడో మాకసలు తెలిసేదే కాదు. ఠంచనుగా ఫస్టు తారీఖున అద్దె మాత్రం కట్టేవాడు అంతే. అంతకు మించి చిన్నమెత్తు కూడా అతని గురించి మాకు తెలీదు నాయనా" అని.

అప్పటికి తేరుకుని కారణమడిగారు నాన్న. వాళ్లు చెప్పిన సమాచారం వింటుంటే కాళ్లు వణికాయి మా అందరికీ.

అతనో హంతకుడట. అతను చెప్పిన పేరూ, ఊరూ తప్పు. చేపల చెరువూ లేదూ, చీమల పుట్టా లేదు. వాళ్ల ఊళ్లో ఓ పెద్ద భూస్వామి కుటుంబం మొత్తాన్ని హత్య చేసి ఇల్లంతా దోచుకుని పారిపోయాడట ఎనిమిది నెలల క్రితం. "అప్పట్నుంచీ పెద్ద ఎత్తున గాలిస్తున్నాం. ఇన్నాళ్లకి ఇక్కడ ఉన్నట్టు సమాచారమందింది. వెంటనే వచ్చాం కానీ ఇక్కడా మకాం మార్చేశాడు రాస్కెల్" అన్న పోలీసులు వెళ్తూ చెప్పి వెళ్లారు- "మళ్లీ వస్తే రహస్యంగా మాకు కాల్ చెయ్యండి" అని.

ఆ రోజు రాత్రి నాకు నిద్రలేదు. ఏదో బాధ. ఆత్మీయతని పోగొట్టుకున్న విషాదం మనసంతా.

మరుసటి రోజు సాయంత్రం నాన్నకి తెలిసిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంటికి వచ్చారు. జరిగిన సంగతంతా నాన్న ఆయనకు ఫోన్ చేసి చెప్పినట్టున్నారు- ముందు జాగ్రత్తకి.

"మీరేం భయపడకండి. అతను మళ్లీరాడు."

"ఏమిటి భరోసా?" మా బామ్మ ఆందోళన.

నిట్టూర్చి చెప్పుకొచ్చాడాయన... ఒక పల్లెటూర్లో స్కూలు మాస్టరు కొడుకతను. పేరు బోసు. చాలా మంచివాడు. గొప్ప తెలివితేటలున్నవాడు. ఐ.ఏ.యస్‌కి సెలక్టయి ట్రైనింగ్‌లో ఉన్నాడు. అప్పుడు జరిగింది- వాళ్ల ఊరి పెద్ద కామందు కొడుకు చాలా దుండగుడు- ఇతని చెల్లెల్ని చెరిచాడు. తండ్రి వెళ్లి కామందుతో చెప్పుకున్నాడు- న్యాయం చెయ్యమని. చాలా అల్లరయింది. అవమానం భరించలేక తల్లీ, తండ్రీ, చెల్లెలూ ఆత్మహత్య చేసుకున్నారు. వారి అంత్యక్రియల కోసం ఆ ఊరు వచ్చిన బోసు ఆరాత్రి కామందు కుటుంబాన్నంతటినీ చంపేసి పారిపోయాడు. ఇల్లంతా కూడా దోచుకుపోయాడని అంటారు. నిజమెంతో తెలీదు... ముగించాడాయన.

మూగవాళ్లమయి విన్నాం- మనసులు బరువెక్కిపోయాయి. ఆయన వెళ్లిపోయినా ఎవ్వరం మాట్లాడుకోలా.

★ ★ ★

పదిరోజులు గడిచాయి. ఒక ట్రాన్స్‌పోర్టు ఆఫీసు నుంచి మినీ ట్రక్‌మీద ఓ పెద్ద అట్టపెట్టె వచ్చింది. సందేహం లేదు- నాన్న పేరే, అడ్రసు మాదే.

తెచ్చిన వాళ్లు వెళ్లిపోయాక విప్పిచూశాం. పెద్ద యల్.ఈ.డీ టీవీ. టీవీకి ఒక మూల చిన్న గులాబీ రంగు స్లిప్... చిన్నాకి ప్రేమతో- అపరిచితుడు.

నా కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ★